నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 23 మే 2024 | ADILABAD NIRMAL

చెట్టు కింద పసి పిల్లలకు టీకాలు వేస్తున్న ఆశ కార్యకర్తలు

చెట్టు కిందే టీకాలు

- సబ్ సెంటర్‌లో పవర్ మీటర్ లేకపోవడంలో నిలిచిన సరఫరా
- ఉక్కపోతతో పిల్లలు, తల్లిదండ్రులు, సిబ్బంది అవస్థలు

నర్సాపూర్(జి), మే 22 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని హెల్త్ సబ్ సెంటర్‌లో కరెంటు లేకపోవడంలో ఆశ వర్కర్లు టీకాలను చెట్ల కిందనే వేస్తున్నారు. ఇక్కడ ప్రతి బుధ, శనివారాల్లో చిన్న పిల్లలకు టీకాలు వేస్తారు. ఈ హెల్త్ సబ్ సెంటర్‌ను శిథిలావస్థలో ఉన్న క్వార్టర్‌లో కొనసాగిస్తున్నారు. ఇందులో కనీసం మీటరు కూడా లేదు. ఎండాకాలం కావడంతో ఉక్కపోతతో సిబ్బందితోపాటు పిల్లలు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో శిథిలావస్థలో ఉన్న భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ హెల్త్ సబ్ సెంటర్‌ను ఇక్కడి నుంచి వేరే చోటికి మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

బోనస్ కోసం బైఠాయింపు

అన్ని రకాల వడ్లకు రూ.500 ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకుల నిరసన

ఖానాపూర్, మే 22 : అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు నిరసన బాట పట్టారు. బుధవారం ఖానాపూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత పదేండ్లలో కేసీఆర్ సాగు నీరు, ఉచిత కరెంటు ఇచ్చి రైతులను రాజును చేశాడని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి మాట మర్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మాట తప్పిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షుడు రాజగంగన్న, గౌరికర్ రాజు, నాయకులు ఖలీల్, రామునాయక్, మహేందర్, ప్రదీప్, చంద్రవాస్, లింగన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

నకిలీ విత్తనాలను సరఫరా చేస్తే చర్యలు

కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 22 : ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ విత్తనాలను సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ గౌష్ ఆలం, వ్యవసాయ, పోలీసు శాఖతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలను అరికట్టడంలో భాగంగా వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల సమయంలో స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్, నిర్వహణ వంటి వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీలో జిల్లా పరిధిలో డీఎస్పీ, ఏడీఏ, ఆర్డీవోలు.. మండల, డివిజన్ స్థాయిలో తహసీల్దార్లు, ఏవో, సీఐలు ఉంటారన్నారు. ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. విత్తన, ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి, అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్‌ను పరీక్షలకు పంపించాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

నిర్మల్ అర్బన్, మే 22 : నిర్మల్ మున్సిపాల్టీలో రెండేండ్ల క్రితం 44 మందిని నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాల్లో నియమించారు. అప్పట్లో ఇక్కడ విధులు నిర్వహించిన నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డిని బాధ్యుడిని చేస్తూ బుధవారం రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన రంగారెడ్డి జిల్లాలోని తుర్కయాంజల్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి..

మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 22 : పెండింగ్‌లో ఉన్న ధరణి, ప్రజావాణి దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని తహసీల్దార్లకు కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. జూన్ రెండో వారంలో ప్రజావాణి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని రకాల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఆర్‌వో వినోద్ ఉన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు పాటుపడాలి

మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటు పడాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఎంవీ భాగ్యారెడ్డి వర్మ 136వ అధికారిక జయంతి వేడుకలను బుధవారం పట్టణంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ భాగ్యారెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.డీఎస్పీడీవో భగత్ సునీతాకుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఎస్‌డబ్ల్యూవో నారాయణ్‌రెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్ : కోనుగోలు కేంద్రంలో వడ్లు కుప్పల మధ్యల నుంచి పారుతున్న వర్షపు నీరు

తాంసి : పున్నగూడలో గాలివానకు ఇంటిపై పడ్డ విద్యుత్ స్తంభం

కుంటాల : పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద టార్పాలిన్ కవర్లను కప్పుతున్న రైతులు

వడ్లన్నీ వర్షార్పణం

- తడిసి ముద్దయిన ధాన్యం
- ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో బుధవారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన వడ్లపై కప్పిన టార్పాలిన్‌లు గాలికి లేచిపోయాయి. తాత్కాలికంగా వేసిన రేకుల షెడ్డు కూలింది. వడ్ల కుప్పల మధ్య వర్షపు నీరు నిలిచింది. తలమడుగు మండలంలోని ఉండం గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. తాంసిలో కొబ్బరి చెట్టు కూలి ఇంటిపై పడడంతో ఇల్లు ధ్వంసమైంది. మార్కెట్ యార్డులో జొన్నలు తడవడంతో ఇబ్బందులు పడ్డారు. కుంటాల మండలంలోని కొనుగోలు కేంద్రాల వద్ద తూకానికి తెచ్చిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకోవడానికి రైతులు ఆగచాట్లు పడ్డారు. ఇచ్చోడ మండలంలోని ముక్రా(బి)లో ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. నిర్మల్ పట్టణంలో చెట్లు, హోర్డింగ్‌లు ఊగిపోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ధాన్యంపై కవర్లను కప్పేందుకు రైతులు పరుగులు తీశారు. నార్నూర్ మండలానికి సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు సంతకు వచ్చిన ప్రజలు, చిరువ్యాపారస్తులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం జొన్న పంట చేతికి రావడంతో వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంద్రవెల్లి మండలంలోని మామిడిగూడ గ్రామానికి చెందిన పలువురి ఇండ్ల పైకప్పులు, రేకులు ఊడిపోయాయి. దీంతో ఇండ్లల్లో వర్షపు నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు తడిశాయి. వడగాం రింగ్‌రోడ్డు మార్గంలో చెట్లు రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బోథ్ మండలంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. కాగా.. ఇప్పటికే రోజు ఆరబెడుతూ ఎండలో కష్టపడుతున్న రైతులు వర్షానికి మళ్లీ వడ్లు తడిసిపోయే సరికి నిరుత్సాహం చెందుతున్నారు. తేమ తగ్గే వరకు ఆరబెట్టాలంటే మరో నాలుగు రోజు పడుతుందని ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట వర్షాలు కురియడంతో నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ ఉన్న వడ్లు కొనాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

– నమస్తే నెట్‌వర్క్

తాంసి : ఉండంలో విరిగి పడ్డ విద్యుత్ స్తంభం

ఇంద్రవెల్లి : మామిడిగూడలో ఈదురు గాలులతో ఉడిపోయిన ఇండ్లపై రేకులు

ఉట్నూర్ రూరల్ : ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పుతున్న రైతులు

తాంసి : సబ్ మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన జొన్న బస్తాలు

సంతతో చింత

వారసంత గుండా రోగులు వెళ్లాలంటే నరకం..

నార్నూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ద్వారానే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలి. ప్రతి బుధవారం నడిరోడ్డుపైనే సంత జరుగుతుండడంతో చుట్టూ పక్కల దాదాపు 30 గ్రామాలకు పైగా ప్రజలు ఇక్కడికే వస్తారు. దాదాపు రెండు నుంచి మూడు వేల మంది ఇక్కడికి వచ్చే సరుకులు, ఇతరాత్ర వస్తువులు తీసుకెళ్తారు. ఏజెన్సీ ఏరియాలోని గిరిజనులు ప్రతి ఒక్కరు దాదాపు వారానికి సరిపడా సురుకులు తీసుకెళ్తారు. కానీ.. సంతను రోడ్డుపై ఏర్పాటు చేయడంతో ఈ మార్గం గుండా ప్రభుత్వ దవాఖానకు వెళ్తే రోగులు అవస్థలు పడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి, దవాఖానకు తీసుకురావాలంటే ప్రాణాలు గాలిలో కలిసిపోయే దుస్థితి నెలకొంది. ఈ వారసంతను వేరే చోటికి మార్చాలని ప్రజలు కోరుతున్నారు. - నార్నూర్, మే 22

నార్నూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సంత నుంచి వెళ్తున్న అంబులెన్స్

ధాన్యం తరలింపులో జాప్యం వద్దు..

నీటి పారుదల శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్

సోన్, మే 22 : రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడంతో జాప్యం చేయవద్దని నీటి పారుదల శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం సోన్, నిర్మల్ మండలంలోని బొప్పారం, రత్నాపూర్‌కాండ్లీ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. తరుగు తీస్తున్నారా అని తెలుసుకున్నారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం వేయాలని, సేకరించిన ధాన్యాన్ని లారీలలో లోడ్ చేయించి రైస్‌మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తరలింపులో జాప్యానికి తావుల్లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

1,02,689 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం.. : కలెక్టర్

జిల్లావ్యాప్తంగా 228 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇప్పటివరకు 1,02,698 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు, క్లినింగ్ మిషన్, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, సివిల్ సప్లయ్ అధికారిణి నందిత, డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీఎం శ్రీకళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, ఏడీ మార్కెటింగ్ అశ్వక్, డీసీవో నర్సయ్య, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానంద్ పాల్గొన్నారు.

బొప్పారంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, పక్కన నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

రేపే పాలీ సెట్

- పరీక్ష రాయనున్న 1,946 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ

నిర్మల్ అర్బన్, మే 22 : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షను శుక్రవారం నిర్వహించడానికి విద్యా శాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ జూనియర్ కళాశాలలో 350, శాంతినగర్ కాలనీలోని బాలుర జూనియర్ కళాశాలలో 456, ప్రభుత్వ బాలిక ల జూనియర్ కళాశాలలో 456, ప్రభు త్వ డిగ్రీ కళాశాల(శాంతినగర్)లో 300, శాంతినగర్‌లోని బాలికల విద్యాలయం లో 384 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,946 మం ది పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఒక గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 11 గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరు. పరీక్ష పకడ్బందీగా నిర్వహించడానికి విద్య, రెవెన్యూ, పోలీస్, వైద్య శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సదుపాయం, వైద్య సౌకర్యాలను కల్పిస్తున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు పర్చనున్నారు. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని ప్రిన్సిపల్ అన్నపూర్ణ తెలిపారు.

నిర్మల్ జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల

ఆదిలాబాద్‌లో 1,059 మంది

ఎదులాపురం, మే 22 : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం ఈనె ల 24న పాలీసెట్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ జిల్లా సమన్వయకర్త భరద్వాజ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో మూడు కేంద్రాలను ఏర్పాటు చే యగా.. ఇందులో 1,059 మంది పరీక్ష రాయనున్నారు. నలంద డిగ్రీ కాలేజీ(మావల)లో 411, విద్యార్థి డిగ్రీ కాలేజీ (రవీంద్రనగర్-ఆదిలాబాద్ టౌన్)లో 360, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (ఆర్ట్స్ అండ్ కామర్స్) హెడ్‌పోస్టాఫీస్, వన్ టౌన్ పో లీస్ స్టేషన్(ఆదిలాబాద్)లో 288 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పెన్సిల్, ఏరాజర్, బాల్ పాయింట్ పెన్, వాటర్ బాటిల్ తెచ్చుకోవాలన్నారు.